# తొలివెలుగు

జాతీయ దిన పత్రిక

మన భాష.. మన పత్రిక..

https://tholivelugu.com/

హైదరాబాద్ సంపుటి:01 సంచిక: 25 2-2-2026 వెల: రూ.2/- పేజీలు:



విలేకరులు కావలెను

తొలివెలుగు జాతీయ దిన పత్రిక మన భాష.. మన పత్రిక..

www.epaper.tholivelugu.com

Contacts

తెలంగాణ

94911 34365

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో

తొలివెలుగు జాతీయ తెలుగు దినపత్రికలో పలు విభాగాల్లో పనిచేయుటకు ఉత్సాహవంతులైన స్టేట్ బ్యూరో, జిల్లా స్టాపర్లు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు, మండల రిపోర్టర్లు కావలెను. ఆసక్తి.. అనుభవం గల వారు సంప్రదించగలరు.




# వికసిత విజన్

## 202627 బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్

- డేటా సెంటర్లకు ప్రోత్సాహంగా ట్యాక్స్ హాలిడే
- దీర్ఘకాలిక భవిష్యత్తు కోసం 3 కర్తవ్యాల ప్రకటన
- తయారీ రంగ సామర్థ్యం పెంపునకు కీలక చర్యలు
- విదేశాల నుంచి మరింత మూలధనాన్ని ఆకర్షించే మంత్రం
- ప్రపంచ స్థాయికి దేశీయ ఉత్పాదక రంగం ఎదిగేలా ప్రణాళిక

న్యూఢిల్లీ: సామాన్యుడికి కొంత మోదం.. స్టాక్ మార్కెట్లకు, మదుపర్లకు ఖేదం.. స్టార్టప్‌లకు కాస్త నిరాశ.. పన్ను చెల్లింపుదారులకు అసంతృప్తి.. విదేశీ పెట్టుబడిదారులకు శుభవార్త.. తయారీరంగం వారికి ఊరట.. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఆధ్వర్యంలో ప్రారంభమైన బడ్జెట్ క్రికెట్ మ్యాచ్ చూశాక.. వివిధ వర్గాల అనుభూతులివి. 202627 సంవత్సరానికిగానూ రూ.53.47 లక్షల కోట్ల రూపాయల బడ్జెట్‌ను నిర్మల ఆదివారం లోక్‌సభలో ప్రవేశపెట్టారు. ఈ ఏడాది పశ్చిమ బెంగాల్, తమిళనాడు సహా ఐదు రాష్ట్రాల్లో ఎన్నికలు ఉన్నప్పటికీ, ప్రజాకర్షక హామీలకు దూరంగా బడ్జెట్‌ను రూపొందించారు. విత్త మంత్రి తన బడ్జెట్‌లో తయారీ రంగాన్ని ప్రోత్సహించేందుకు అనేక చర్యలు ప్రకటించారు. మాఘ పౌర్ణమి శుభ పర్వదినాన, సిక్కుల ఆధ్యాత్మిక గురువు గురు రవిదాస్ జయంతి రోజున 202627 బడ్జెట్ ప్రవేశపెడుతున్నట్టు నిర్మల తన ఉపన్యాసాన్ని ప్రారంభించారు. తమ ప్రభుత్వం వచ్చాక ఈ 12 ఏళ్లలో ఆర్థిక రంగానికి స్థిరత్వం వచ్చిందని,

- మిగతా 2వ పేజీలో


## హైదరాబాద్‌కు 7 హై-స్పీడ్ రైల్ కారిడార్‌లు

ముంబై, పూణే, బెంగళూర్, చెన్నై, సిలిగురి, వారణాసిలను కలుపుతూ నెట్వర్క్..

5లో

## దేశ రక్షణకు భారీగా నిధులు..

రూ.7.85 లక్షల కోట్ల బడ్జెట్






## వరల్డ్‌లో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మారడమే లక్ష్యం..

- నిర్మలమ్మ బడ్జెట్‌పై మోడీ ప్రశంసలు
- వరల్డ్‌లో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మారడమే లక్ష్యం
- పౌరులను శక్తివంతం చేస్తుందని వ్యాఖ్య

5లో

## బడ్జెట్‌లో కేరళకు తీవ్ర అన్యాయం జరిగింది..

కేంద్ర బడ్జెట్ 2026 మండిపడుతున్న విపక్షాలు..


మౌలిక వసతుల ప్రస్తావనల్లో కేరళకు చోటు దక్కలేదు: శశిథరూర్



2లో

## నేరపూరిత రాజకీయాలే వైసీపీ సంస్కృతి

- వైసీపీ హయాంలో రాజకీయాలు నేరమయం అయ్యాయన్న చంద్రబాబు
- తాము అధికారంలోకి వచ్చాక చట్టబద్ధ పాలన నెలకొల్పామని వెల్లడి
- నిరాశ, నిస్పృహలతోనే వైసీపీ నేతలు తిట్లకు దిగుతున్నారని విమర్శ
- శాంతిభద్రతలను ఉల్లంఘిస్తే ఎవరినీ వదిలిపెట్టేది లేదని స్పష్టీకరణ
- విశాఖ పీఎంఎల్ఏ కోర్టులో అనుబంధ చార్జిషీటు
- ఆయన పాత్ర లేదు.. నిందితుడిగా చేర్చలేం: ఈడీ
- చార్జిషీటును పరిగణనలోకి తీసుకున్న కోర్టు
- ఈ కేసులో గత నెలలోనే ఆయనకు సీఐడీ క్లీన్‌చిట్





5లో

బెంగాల్‌కు ఒక్క పైసా లేదు..

## చెత్త బడ్జెట్

- అంతా చెత్త.. దిశానిర్దేశం లేదు.. నిరలమ్మ బడ్జెట్‌పై మమత విమర్శలు
- నిరలమ్మ బడ్జెట్‌పై మమత విమర్శలు
- బడ్జెట్‌కు దిశానిర్దేశం లేదన్న మమత

## మాజీ మంత్రి జోగి రమేశ్ ఇంటిపై టీడీపీ కార్యకర్తల దాడ

- లోకేశ్ పై వ్యాఖ్యల నేపథ్యంలో రాళ్లు, పెట్రోల్ బాంబుల వినియోగం!
- తీవ్రంగా స్పందించిన జోగి రమేశ్
- ఏం తప్పు చేశానని నా ఇంటిపై దాడిచేశారంటూ ఆగ్రహం
- అధికారంలో ఎప్పుడూ మీరే ఉండరంటూ ఘాటు వ్యాఖ్యలు



2లో

## ఫోన్ ట్యాపింగ్ కేసులో ముగిసిన కేసీఆర్ విచారణ

- కేసీఆర్‌ను నాలుగున్నర గంటలపాటు ప్రశ్నించిన సిట్.
- కేసీఆర్ ను ప్రశ్నించిన ఆరుగురు సభ్యుల సిట్ బృందం
- సాక్ష్యాలు, స్టేట్‌మెంట్లపై వివరణ నమోదు
- కేసీఆర్ వాంగ్మూలాన్ని ఆడియో, వీడియో రికార్డ్ చేసిన అధికారులు
- నిందితుల వాంగ్మూలాల ఆధారంగా సాగిన దర్యాప్తు



2లో



2లో

## తెలంగాణ గుర్తుకురాలేదా?

- ఏం పాపం చేసిందని హైదరాబాద్‌ను పట్టించుకోలేదు?
- ఎంపీలందరూ రాజకీయాలకతీతంగా రాష్ట్ర ప్రయోజనాల కోసం పోరాడాలి
- కేసీఆర్‌ను సిట్ విచారించడం అధికారికంగా, చట్టబద్ధంగానే జరుగుతోంది : డిప్యూటీ సీఎం భట్టి

# ఫోన్ ట్యాపింగ్ కేసులో ముగిసిన కేసీఆర్ విచారణ

తెలంగాణ రాజకీయాల్లో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక ఘట్టం ముగిసింది. నందినగర్‌లోని కేసీఆర్ నివాసంలో దాదాపు 4 గంటల 50 నిమిషాల పాటు సిట్ అధికారులు ఆయనను సుదీర్ఘంగా విచారించారు. ఆదివారం మధ్యాహ్నం ప్రారంభమైన ఈ విచారణ సాయంత్రం వరకు ఉత్కంఠగా సాగింది. ఏసీపీ స్థాయి అధికారులతో కూడిన ఆరుగురు సభ్యుల సిట్ బృందం ఈ విచారణలో పాల్గొంది. కేవలం ప్రశ్నలు అడగడమే కాకుండా, ఇప్పటికే ఈ కేసులో అరెస్టయిన ఇతర నిందితులు ఇచ్చిన స్టేట్‌మెంట్లను కేసీఆర్ ముందు ఉంచి వివరణ కోరినట్లు సమాచారం. గతంలో విచారించిన అధికారుల వాంగ్మూలాలను, సాంకేతిక ఆధారాలను కేసీఆర్‌కు చూపించి, వాటిపై ఆయన వెర్షన్‌ను సిట్ రికార్డ్ చేసింది. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం ఎవరి ఆదేశాల మేరకు జరిగింది? అందులో ఎవరెవరి పాత్ర ఉందనే కోణంలో ప్రశ్నించినట్లు తెలుస్తోంది. కేసీఆర్ విచారణ అనంతరం కేసీఆర్ స్టేట్మెంట్ రికార్డ్స్, విచారణకు వినియోగించిన రెండు ట్రంకు డబ్బాలు పలు ఫైల్స్ ఎలక్ట్రానిక్ వస్తువులను తీసుకువెళ్లారు.

# తెలంగాణకు మళ్లీ అన్యాయం

హైదరాబాద్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన తాజా బడ్జెట్‌లో తెలంగాణకు మరోసారి తీరని అన్యాయం జరిగింది. రాష్ట్రానికి దక్కాల్సిన నిధులు, ప్రాజెక్టులు, విభజన హామీల అమలులో కేంద్రం పుష్కరకాలంగా వివక్ష చూపుతోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 60 సార్లు ఢిల్లీకి వెళ్లినా తెలంగాణకు ఒక్క రూపాయి కూడా సాధించలేకపోయారు. బీజేపీ పెద్దలతో "బడే భాయ్‌చోటే భాయ్"అనుబంధం వల్ల రాష్ట్రానికి నిధుల వరద వస్తుందన్న భావన ఈ బడ్జెట్‌తో బూటకమన్న విషయం స్పష్టమైంది. తనపై ఉన్న కేసులు, అవినీతి ఆరోపణల నుంచి తప్పించుకునేందుకే సీఎం ఢిల్లీ పర్యటనలు చేశారు. తెలంగాణ నుంచి గెలిచిన కాంగ్రెస్, బీజేపీ ఎంపీలు, కేంద్ర మంత్రులు రాష్ట్ర ప్రయోజనాల కోసం కనీసం ప్రయత్నించలేదు. పాలమూరురంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా, మెట్రో విస్తరణ, రీజనల్ రింగ్ రోడ్డు, కొత్త రైల్వే లైన్లు, వరంగల్ కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారం స్టీల్ ప్లాంట్, ఐఐఎం, సిరిసిల్ల మెగా టెక్స్‌టైల్ పార్క్ వంటి కీలక డిమాండ్లపై పదేళ్లుగా విజ్ఞప్తులు చేసినా కేంద్రం ఏ ఒక్కదానికీ న్యాయం చేయలేదు. ఈ బడ్జెట్‌లో తెలంగాణకు జరిగిన అన్యాయంపై కాంగ్రెస్, బీజేపీ ఎంపీలు, కేంద్ర మంత్రులు, రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు సమాధానం చెప్పాలి.

# ఎకానమీని పరుగులు పెట్టించేలా కేంద్ర బడ్జెట్ ఉంది: ఏపీ ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్

**ఆర్థిక వ్యవస్థకు కేంద్ర బడ్జెట్ ఊతమిస్తుందన్న మంత్రి పయ్యావుల**

**హైస్పీడ్ రైల్ కారిడార్లు, సెమీకండక్టర్ మిషన్‌తో ఏపీకి ప్రయోజనం**

**టెక్స్‌టైల్ క్లస్టర్లు, డేటా సెంటర్లతో ఉపాధి అవకాశాలు**

**కొబ్బరి, జీడిపప్పు రైతులకు ప్రోత్సాహకాలపై హర్షం**

**పేద, మధ్యతరగతి వర్గాల అభ్యున్నతికి దోహదపడే బడ్జెట్ అని వ్యాఖ్య**

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 202627 బడ్జెట్, దేశాన్ని స్థిరమైన, బలమైన ఆర్థిక శక్తిగా ముందుకు నడిపిస్తుందని ఆంధ్రప్రదేశ్ ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. దేశ ఆర్థిక పురోగతికి బాటలు వేసే బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన ప్రధాని నరేంద్ర మోదీ, తొమ్మిదోసారి బడ్జెట్ ప్రవేశపెట్టిన ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు ఆయన అభినందనలు తెలిపారు. ఈ బడ్జెట్ పారిశ్రామిక రంగానికి ఊతమిస్తూ, పేద, మధ్యతరగతి వర్గాల అభ్యున్నతికి దోహదపడుతుందని అభిప్రాయపడ్డారు. మొత్తమ్మీద, ఆర్థిక వ్యవస్థను పరుగులు పెట్టించేలా కేంద్ర బడ్జెట్ ఉందని కితాబిచ్చారు. ఈ బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు మేలు చేసే పలు కీలక ప్రకటనలు ఉన్నాయని మంత్రి వివరించారు. ముఖ్యంగా హైదరాబాద్–బెంగళూరు, హైదరాబాద్–చెన్నై, బెంగళూరు–చెన్నై నగరాలను కలిపే మూడు హైస్పీడ్ రైలు కారిడార్ల ద్వారా రాష్ట్రం ఆర్థికంగా లబ్ధి పొందుతుందని చెప్పారు. అలాగే, రూ.40,000 కోట్లతో ఇంటిగ్రల్ సెమీకండక్టర్ మిషన్ 2.0 పథకాన్ని విస్తరించడం ద్వారా రాష్ట్రానికి కూడా మేలు జరుగుతుందని అన్నారు. వస్త్ర పరిశ్రమ కోసం టెక్స్‌టైల్ క్లస్టర్ల ఏర్పాటు, 2047 వరకు డేటా సెంటర్లకు పన్ను మినహాయింపులు వంటి నిర్ణయాలు ఉపాధి కల్పనను ప్రోత్సహిస్తాయని తెలిపారు. కేంద్ర బడ్జెట్‌లో కొబ్బరి, కోకో, జీడిపప్పు వంటి వాణిజ్య పంటలకు ప్రోత్సాహం ఇవ్వడం రాష్ట్ర రైతులకు పెద్ద ఊరట అని పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు. ఈ నిర్ణయం రాష్ట్రంలోని రైతుల ఆదాయం పెరగడానికి దోహదపడుతుందని అభిప్రాయపడ్డారు. ఆంధ్రప్రదేశ్‌తో సహా ఐదు రాష్ట్రాల్లో రేర్ ఎర్త్ మినరల్స్ అన్వేషణ పథకం కూడా రాష్ట్రానికి మేలు చేస్తుందని అన్నారు. పూర్వోదయ పథకం కింద భవిష్యత్తులో రాష్ట్రానికి మరిన్ని ప్రయోజనాలు దక్కుతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

# ఎన్డీయేలో చంద్రబాబు కీలకంగా ఉన్నా, బడ్జెట్ లో ఏపీకి వచ్చింది గుండు సున్నా: షర్మిల

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు తీవ్ర అన్యాయం జరిగిందని ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఎన్డీయే ప్రభుత్వంలో ముఖ్యమంత్రి చంద్రబాబు కీలక భాగస్వామిగా ఉన్నప్పటికీ, రాష్ట్ర ప్రయోజనాలు కాపాడటంలో విఫలమయ్యారని, 50 లక్షల కోట్ల రూపాయల భారీ బడ్జెట్‌లో ఏపీకి లభించింది గుండు సున్నా అని ఆమె విమర్శించారు. ఇది ఐదు కోట్ల ఆంధ్రులను దగా చేసిన బడ్జెట్ అని, రాష్ట్ర ఆత్మగౌరవాన్ని కేంద్రం అణగదొక్కిందని ఆరోపించారు. ఈ బడ్జెట్‌పై ఆమె తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. "విభజన హామీలలో ఒక్కదానికీ దిక్కులేదు. ప్రత్యేక హోదా ఊసే లేదు. వెనకబడిన ఉత్తరాంధ్రకు, రాయలసీమకు ఎలాంటి భరోసా ఇవ్వలేదు. రాష్ట్ర జీవనాడి పోలవరానికి నిధులు కేటాయించకుండా జీవం తీశారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌పై కనికరం చూపలేదు, కడప స్టీల్ ప్లాంట్ వైపు కన్నెత్తి చూడలేదు. మెట్రో రైలు, పారిశ్రామిక కారిడార్ల ప్రస్తావనే లేదు" అని షర్మిల దుయ్యబట్టారు. అమరావతి రాజధాని నిర్మాణంపై కేంద్రం తీరును ఆమె తప్పుబట్టారు. లక్ష కోట్ల రూపాయలతో నిర్మించాలనుకున్న రాజధానికి కేవలం రూ.1,500 కోట్ల అప్పు ఇప్పిస్తామనడం దారుణమని అన్నారు.

# వికసిత విజన్

(మొదటి పేజీ తరువాయి)

సుస్థిరాభివృద్ధి, ద్రవ్య క్రమశిక్షణ సాధ్యమయ్యాయని, ద్రవ్యోల్బణం అదుపులో ఉందని చెప్పుకొచ్చారు. తమ ప్రభుత్వం ప్రజాకర్షక హామీలకంటే ప్రజల ప్రయోజనాలను నిరంతరం ఎంచుకుంటూ ముందుకు సాగుతోందన్నారు. మోదీ ఆలోచనలకు అనుగుణంగా.. దీన్ని 'యువ శక్తి నడిపిన బడ్జెట్'గా ఆమె అభివర్ణించారు. విత్తమంత్రి తన ప్రసంగాన్ని మూడు ప్రధాన కర్తవ్యాలతో ప్రారంభించారు. అవి సమ్మిళిత వృద్ధి, ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడం, అందరితో కలసిఅందరి ప్రగతి. జీఎస్టీ సరళీకరణ, లేబర్ కోడ్స్ నోటిఫికేషన్ వంటి 350కిపైగా సంస్కరణలు తీసుకొచ్చామన్నారు. మొదటి కర్తవ్యం కింద 6 రంగాల్లో చర్యలు ప్రతిపాదించారు. కీలక రంగాల్లో తయారీని భారీగా పెంచడం, 'చాంపియన్ సూక్ష్మ, చిన్న మధ్యతరహా పరిశ్రమలు (ఎమ్ఎస్ఎమ్ఈ)' తయారుచేయడం, మౌలిక వసతుల రంగానికి ఊపునివ్వడం, ఇంధనరంగంలో సుస్థిరాభివృద్ధి దీర్ఘకాలిక భద్రతకు చర్యలు, పట్టణ ఆర్థిక ప్రాంతాల అభివృద్ధి వంటివి ఇందులో ఉన్నాయి. 202627 బడ్జెట్‌లో కస్టమ్స్ విధానాన్ని సరళీకరించారు. అనవసర మినహాయింపులను తగ్గించారు. 17 రకాల క్యాన్సర్ మందులపై కస్టమ్స్ డ్యూటీని పూర్తిగా ఎత్తేశారు. ప్రయాణికుల బ్యాగేజ్ నిబంధనలను సడలించి, వ్యక్తిగత వినియోగానికి దిగుమతి చేసే వస్తువులపై కస్టమ్స్ డ్యూటీని 10 శాతానికి తగ్గించారు. ఫార్మాస్యూటికల్స్, సెమీకండక్టర్లు, రేర్ ఎర్త్ మ్యాగ్నెట్లు, రసాయనాలు, క్యాపిటల్ గూడ్స్, టెక్స్‌టైల్స్, క్రీడా పరికరాలు వంటి ఏడు రంగాల్లో తయారీ సామర్థ్యాన్ని పెంచడమే లక్ష్యంగా బడ్జెట్‌లో కీలక ప్రతిపాదనలు చేశారు. ఉద్యోగాల సృష్టి, సాంకేతికత ఆధారిత అభివృద్ధిపై దృష్టి ఉంటుందని ఆమె స్పష్టం చేశారు.

**పర్యాటకం చిరు వ్యాపారాలు**

హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్, జమ్మూకశ్మీర్‌లలో పర్యావరణ హిత పర్వత మార్గాల అభివృద్ధికి ప్రతిపాదించారు. దేశవ్యాప్తంగా 15 పురావస్తు కేంద్రాల అభివృద్ధికి కూడా బడ్జెట్‌లో ప్రతిపాదనలు చేశారు. చిన్న పరిశ్రమల కోసం ప్రత్యేకంగా రూ.10,000 కోట్ల ఎస్ఎంఈ గ్రోత్ ఫండ్‌ను ఏర్పాటు చేయనున్నారు. మనదేశంలో డేటా సెంటర్లు ఏర్పాటుచేసే సంస్థలకు నిర్మలమ్మ పెద్ద శుభవార్తే చెప్పారు. భారతదేశం నుంచి గ్లోబల్ డేటా సెంటర్ సేవలు అందించే సంస్థలకు ఏకంగా 20 ఏళ్ల పాటు.. అంటే 2047 వరకు పన్ను



మినహాయింపు ప్రకటించారు. కార్పొరేట్ బైబ్యాక్ కొనుగోళ్లపై 22 శాతం పన్ను, నాన్ కార్పొరేట్ బైబ్యాక్ కొనుగోళ్లపై 30 శాతం పన్ను విధించారు. ఫ్యూచర్స్ ట్రేడింగ్‌పై సెక్యూరిటీస్ ట్రాన్సాక్షన్ ట్యాక్స్ (ఎస్టీటీ) పెంచుతున్నట్టు ప్రకటించారు. విదేశీ టూర్ ప్యాకేజీలపై టీసీఎస్‌ను 2 శాతానికి తగ్గించారు. విదేశీ విద్య, వైద్య ఖర్చులపై కూడా టీసీఎస్ తగ్గింపు ప్రకటించారు. ఏప్రిల్ 1 నుంచి కొత్త ఆదాయపన్ను చట్టం అమల్లోకి వస్తుందని వెల్లడించారు. విద్యార్థులు, యువ ఉద్యోగులు, టెక్ ఉద్యోగులు, విదేశాల నుంచి తిరిగి వచ్చిన ఎన్నారైలు వంటి చిన్న పన్ను చెల్లింపుదారులు ఎదుర్కొనే సమస్యలను పరిష్కరించేందుకు, 6 నెలల పాటు అమల్లో ఉండే విదేశీ ఆస్తుల వెల్లడింపు పథకాన్ని ప్రవేశపెడుతున్నట్టు వెల్లడించారు. ఆర్థిక మార్కెట్లను బలోపేతం చేసేందుకు, విదేశాల నుంచి మరింత మూలధనాన్ని ఆకర్షించేందుకు నిర్మల మూడు కీలక అంశాలు ప్రకటించారు.

# తెలంగాణ గుర్తుకురాలేదా?

హైదరాబాద్: కేంద్ర బడ్జెట్‌పై డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ బడ్జెట్ ప్రవేశపెట్టే సమయంలో కేంద్రానికి తెలంగాణ గుర్తుకు రాలేదా అని ప్రశ్నించారు. ప్రపంచంతో పోటీ పడే స్థాయిలో అన్ని రంగాల్లో అనుకూలతలు కలిగి ఉన్న హైదరాబాద్ ఏం పాపం చేసిందని పట్టించుకోలేదని నిలదీశారు. ఆదివారం ప్రజాభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు కేటాయింపులు ఉంటాయని ఆశించాం..కానీ నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ తమను నిరాశ పర్చిందని వ్యాఖ్యానించారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం తాను, సీఎం రేవంత్, సహచర మంత్రులు, ఎంపీలు పలు దఫాల్లో బృందాలుగా వెళ్లి దేశ ప్రధాని, ఆర్థిక మంత్రిని కలిసి విన్నవించినా ఫలితం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. 'హైదరాబాద్ ప్రపంచానికి ఫార్మా రాజధాని వంటిది. కోవిడ్ సమయంలో ప్రధాని మోదీ స్వయంగా వచ్చి ప్రశంసించిన భారత్ బయోటెక్ ఈ మట్టిలోనే ఉంది. కానీ బయో ఫార్మా కేటాయింపుల్లో తెలంగాణ పేరు లేకపోవడం విడ్డూరం. ఎలక్ట్రానిక్స్ రంగానికి రూ.40 వేల కోట్లు కేటాయించి, ఈసీఐఎల్ వంటి దిగ్గజ సంస్థలున్న హైదరాబాద్‌కు ఒక్క పైసా ఇవ్వకపోవడం నిరాశ పరిచింది. హైదరాబాద్ అంటే ఎలక్ట్రానిక్స్. ఎలక్ట్రానిక్స్ అంటే హైదరాబాద్ అన్న నానుడిని కేంద్రం చెరిపివేసే ప్రయత్నం చేస్తోంది. భవిష్యత్ తరాలకు అత్యంత కీలకమైన ఆరెంజ్ ఎకానమీ (ఆడియో, వీడియో, గేమింగ్, కామిక్స్) రంగంలో హైదరాబాద్ ప్రపంచస్థాయి సామర్థ్యాన్ని కలిగి ఉంది. కానీ కేంద్రం ఉద్దేశపూర్వకంగా ముంబైకి మళ్లించింది. మెడికల్ టూరిజంలో దేశానికే తలమానికంగా ఉన్న తెలంగాణను విస్మరించి, ఇతర రాష్ట్రాలకు రీజినల్ మెడికల్ వ్యాల్యూ హబ్‌లు ఇవ్వడం ఏ చట్టం కిందకు వస్తుంది. ఇలా అన్ని రంగాల్లో హైదరాబాద్‌ను పట్టించుకోకుండానే బడ్జెట్ ప్రతిపాదనలు పెట్టారు'అని వ్యాఖ్యానించారు. హైదరాబాద్ నగరాభివృద్ధికి కీలకమైన మూసీ పునరుజ్జీవం, రీజినల్ రింగ్ రోడ్ , మెట్రో రైలు విస్తరణ వంటి ప్రాజెక్టులకు భారీగా నిధులు ఆశించాం..కానీ ఒక్క ప్రాజెక్టుకు కూడా కేటాయింపులు లేకపోవడం తీవ్ర నిరాశ కలిగించిందని భట్టి అన్నారు. సెమీ కండక్టర్ పరిశ్రమ కోసం సీఎం రేవంత్‌రెడ్డి, పరిశ్రమలు, ఐటీ మంత్రి శ్రీధర్‌బాబుతో కలిసి ప్రధానిని కలిసినా ఫలితం లేకపోయిందని చెప్పారు. రామప్ప దేవాలయం, మన్ననూరు, కవ్వాల్ టైగర్ రిజర్వ్‌లు, చారిత్రక ఆలయాలతో టూరిజం కేంద్రంగా ఉన్న తెలంగాణకు టూరిజం ప్యాకేజీలో కేంద్రం స్థానం కల్పించకపోవడం అన్యాయమన్నారు. ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేయడం ద్వారా గ్రామీణ పేదల బతుకుతెరువును దెబ్బతీస్తోందని విమర్శించారు. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల సంక్షేమంపై బడ్జెట్ మౌనాన్ని వహించడం సామాజిక న్యాయానికి విరుద్ధమన్నారు. కేంద్రానికి ఒక నీతి, రాష్ట్రానికి ఒక నీతా అని భట్టి ధ్వజమెత్తారు. రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న ఎంపీలు పార్టీలు, రాజకీయాలకతీతంగా బడ్జెట్ కేటాయింపుల్లో తెలంగాణకు న్యాయం కోసం కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు.

**దేశ రక్షణ కోసం చేయాల్సింది**

ఫోన్ ట్యాపింగ్ కేసులో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను సిట్ విచారించడంపై భట్టి స్పందించారు. కేసీఆర్‌పై తమకు కక్ష సాధింపు అవసరం లేదని, విచారణ అధికారికంగా, చట్టబద్ధంగా జరుగుతోందని చెప్పారు. పారదర్శక పాలన అందించడమే తమ ఆలోచన అని, ప్రభుత్వానికి ఎలాంటి కక్ష సాధింపు లేదన్నారు. అయినా, దేశరక్షణ, ఉగ్రవాద నియంత్రణ కోసం ఉపయోగించాల్సిన ఫోన్ ట్యాపింగ్‌ను వ్యక్తులపై, వారి వ్యక్తిగత జీవితాలపై చేస్తే ఎలా అని ప్రశ్నించారు. విచారణ ఎవరి ఇష్ట ప్రకారం జరగదని, అలా జరిగితే కక్ష అవుతుందని, విచారణ విచారణగానే జరుగుతుందని భట్టి వ్యాఖ్యానించారు.

# మాజీ మంత్రి జోగి రమేశ్ ఇంటిపై టీడీపీ కార్యకర్తల దాడి

"ఏం తప్పు చేశానని నా ఇంటిపై దాడి చేశారు? నా ఇంటిపైకి గంజాయి బ్యాచ్‌ను పంపి పెట్రోల్ బాంబులు వేయిస్తారా?" అంటూ మాజీ మంత్రి, వైసీపీ నేత జోగి రమేశ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. "మీ ఇంటికి నా ఇల్లు ఎంత దూరమో, నా ఇంటికి మీ ఇల్లు అంతే దూరం" అని ప్రత్యర్థులను గట్టిగా హెచ్చరించారు. తన నివాసంపై జరిగిన దాడి ఘటనపై ఆయన తీవ్రంగా స్పందించారు. "ఎప్పుడూ మీరే అధికారంలో ఉంటామని కలలు కంటున్నారేమో. నీ పిల్ల చేష్టలు, క్షణికానందం మానుకో" అని జోగి రమేశ్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. తన ఇంటిపై దాడి జరుగుతున్న సమయంలో పోలీసులు, పోలీసు అధికారులు చోద్యం చూస్తున్నారని ఆరోపించారు. నన్ను ఏం చేయాలనుకున్నారో ఏమో... నన్ను మట్టుబెట్టాలనుకున్నారా... రాళ్లు, కర్రలు, పెట్రోలు బాంబులతో నా ఇంటిపై దాడి చేశారు అని వెల్లడించారు. కృష్ణా జిల్లా ఇబ్రహీంపట్నంలోని జోగి రమేశ్ నివాసాన్ని ఇవాళ తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు ముట్టడించారు. మంత్రి నారా లోకేశ్ పై జోగి రమేశ్ అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆరోపిస్తూ, ఆయన ఇంటిపై దాడికి దిగారు. ఈ క్రమంలో రాళ్లు రువ్వడంతో పాటు పెట్రోల్ బాంబులు కూడా విసిరినట్టు తెలుస్తోంది. ఈ దాడిలో ఇంటికి పాక్షికంగా నిప్పు అంటుకుంది. ఈ దాడి జరిగిన సమయంలో జోగి రమేశ్ తండ్రి, భార్య, కుమారుడు కూడా నివాసంలోనే ఉన్నట్టు తెలుస్తోంది.



# నేరపూరిత రాజకీయాలే వైసీపీ సంస్కృతి

వైసీసీ రాజకీయాలు నేరమయం అయ్యాయని, వారి పాలనకు అరాచకమే నమూనాగా నిలిచిందని ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్రస్థాయిలో విమర్శించారు. 2024లో తాము అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో చట్టబద్ధమైన పాలనను తిరిగి నెలకొల్పామని ఆయన స్పష్టం చేశారు. నేరపూరిత రాజకీయాలే వైసీపీ సంస్కృతి అని... ప్రజా సాధికారత, ప్రజాసేవ తమ ప్రభుత్వ సంస్కృతి అని ఆయన పేర్కొన్నారు. గతంలో వారు ధ్వంసం చేసిన ప్రతీదాన్నీ తమ ప్రభుత్వం తిరిగి నిర్మిస్తుండటాన్ని చూసి వైసీపీ నేతలు ఓర్వలేకపోతున్నారని చంద్రబాబు అన్నారు. వారి తప్పులు రోజురోజుకు బయటపడుతుండటంతో, నిరాశ, నిస్పృహలకు లోనై ప్రతిపక్షంలో ఉన్నా కూడా దూషణలకు దిగుతున్నారని ఆరోపించారు. అయితే, చట్టం అత్యున్నతమైనదని, తాము నెలకొల్పిన శాంతిభద్రతలను కాపాడాల్సిన బాధ్యత తమపై ఉందని చంద్రబాబు తేల్చిచెప్పారు. చట్టాన్ని, నియమాలను ఉల్లంఘించడానికి ఎవరినీ అనుమతించేది లేదని ఆయన గట్టిగా హెచ్చరించారు. రాష్ట్రంలో శాంతిభద్రతల విషయంలో కఠినంగా వ్యవహరిస్తామని ఆయన స్పష్టం చేశారు. స్కిల్ డెవల్‌పమెంట్ కేసులో కేంద్ర ప్రభుత్వ ఏజెన్సీ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కూడా ముఖ్యమంత్రి చంద్రబాబుకు క్లీన్ చిట్ ఇచ్చింది. ఈ కేసులో కొందరు నిందితులు ప్రభుత్వ నిధులు మళ్లించినట్లు గుర్తించామని.. కానీ చంద్రబాబు పాత్ర మాత్రం లేదని పేర్కొంది. అందువల్ల ఆయన్ను ఈ కేసులో నిందితుడిగా చేర్చలేమని తెలిపింది. గత నెల 28న విశాఖపట్నంలోని ప్రత్యేక పీఎంఎల్ఏ (మనీలాండరింగ్ నిరోధక చట్టం) కోర్టులో తాను దాఖలు చేసిన అనుబంధ చార్జిషీటును న్యాయస్థానం పరిగణనలోకి తీసుకుందని ఈడీ ఓ ప్రకటనలో వెల్లడించింది. దీంతో దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించి.. తప్పుడు కేసులో చంద్రబాబును అరెస్టుచేయడంతో రాష్ట్ర రాజకీయాల్లో కీలక మలుపునకు కారణమైన స్కిల్ కేసు కథ దాదాపు ముగిసినట్లేనని న్యాయనిపుణులు అంటున్నారు. చంద్రబాబుకు ఎలాంటి సంబంధం లేని ఈ కేసులో ఆయన్ను ఇరికించి, అక్రమంగా అరెస్టుచేసి 53 రోజులు రాజమండ్రి సెంట్రల్ జైలులో పెట్టి.. సరైన సౌకర్యాలు కల్పించకుండా నరకయాతన పెట్టిన సంగతి తెలిసిందే. ఈ కేసులో ఆయన అవినీతికి పాల్పడ్డారనడానికి ఎలాంటి ఆధారాలూ లేవని, కేసును మూసివేయాలని దర్యాప్తు సంస్థ సీఐడీ కోరడంతో గత నెల 12న ఏసీబీ కోర్టు ఆమోదం తెలిపిన సంగతి తెలిసిందే. దీనిపై అప్పట్లో జగన్, వైసీపీ నాయకులు ఎంతో గగ్గోలు పెట్టారు. ఇప్పుడు ఈడీ కూడా చంద్రబాబు ప్రమేయం లేదని చెప్పడంతో వారి నోళ్లు మూతబడ్డాయి. స్కిల్ డెవల్‌పమెంట్ ప్రాజెక్టు కింద రాష్ట్రవ్యాప్తంగా సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్ క్లస్టర్లను ఏర్పాటు చేయాలని 2014-19 నడుమ అప్పటి టీడీపీ ప్రభుత్వం నిర్ణయించింది. ఈ ప్రాజెక్టు రాష్ట్ర యువతలో నైపుణ్యాభివృద్ధిని ప్రోత్సహించడానికి ఉద్దేశించినది. మొత్తం ప్రాజెక్టు వ్యయం రూ.3,300 కోట్లుగా అంచనా వేశారు. ఈ స్కిల్ ప్రాజెక్టులో అక్రమాలు జరిగాయని.. రాష్ట్ర ఖజానాకు రూ.300 కోట్లు నష్టం వాటిల్లిందని ఆరోపిస్తూ వైసీపీ ప్రభుత్వ హయాంలో 2023 సెప్టెంబరు 9వ తేదీ రాత్రి చంద్రబాబుని సీఐడీ అరెస్టు చేసింది.

# సీపీఎం నిరసనలను జయప్రదం చేయాలి

- ఫిబ్రవరి 2 నుంచి 15 వరకు జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు యండి జహంగీర్



**చౌటుప్పల్, ఫిబ్రవరి 1 (తొలివెలుగు):** మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని రద్దు చేసి, దాని స్థానంలో "విబిజి రామ్ జి" పేరుతో కొత్త చట్టాన్ని తీసుకురావడం ద్వారా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కూలీల పొట్ట కొట్టే కుట్ర చేస్తోందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు యండి జహంగీర్ తీవ్రంగా విమర్శించారు. ఈ చర్యలకు వ్యతిరేకంగా సీపీఎం ఆధ్వర్యంలో ఫిబ్రవరి 2 నుంచి 15 వరకు జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాలు, మండలాలు, పట్టణ కేంద్రాల్లో సభలు, ర్యాలీలు, నిరసన కార్యక్రమాలు పెద్ద ఎత్తున నిర్వహించాలని ఆయన పిలుపునిచ్చారు. ఆదివారం చౌటుప్పల్ పట్టణంలోని కందాల రంగారెడ్డి భవన్‌లో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు గుంటోజు శ్రీనివాస్ చారి అధ్యక్షతన నిర్వహించిన సీపీఎం జిల్లా కమిటీ సమావేశంలో యండి జహంగీర్ పాల్గొని మాట్లాడారు. ఉపాధి హామీ చట్టం వామపక్ష పార్టీల సుదీర్ఘ పోరాటాల ఫలితమని గుర్తు చేశారు. అయితే ఆ చట్ట స్ఫూర్తికి విరుద్ధంగా కేంద్ర ప్రభుత్వం కొత్త చట్టాన్ని తీసుకువచ్చిందని మండిపడ్డారు. పాత చట్టంలో నిధుల్లో 90 శాతం కేంద్ర ప్రభుత్వమే భరించేదని, కొత్త బిల్లులో రాష్ట్రాలపై 40 శాతం భారం మోపడం ద్వారా ఆర్థికంగా బలహీనమైన రాష్ట్రాలు పథకాన్ని అమలు చేయలేని పరిస్థితి కల్పిస్తున్నారని విమర్శించారు. ఇది ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసే కుట్రేనని అన్నారు. వ్యవసాయ సీజన్‌లో 60 పనిదినాలను తొలగించాలనే నిబంధన ద్వారా కూలీలను మళ్లీ తక్కువ వేతనాలకు యజమానుల వద్ద బానిసలుగా మార్చే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఈ కొత్త చట్టం వల్ల రాజ్యాంగం కల్పించిన 'పని హక్కు'ను కూలీలు కోల్పోతారని, తెలంగాణలో సుమారు 60 లక్షల మంది కూలీలు ఈ పథకంపై ఆధారపడి ఉన్నారని తెలిపారు. నిధులు, పనిదినాలు తగ్గిపోతే కూలీలు వలస బాట పట్టక తప్పదని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం తక్షణమే "విబిజి రామ్ జి" చట్టాన్ని రద్దు చేసి, 2005 మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని యథాతథంగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. పనిదినాలను 200 రోజులకు పెంచాలని, రోజువారీ వేతనాన్ని రూ.800లకు పెంచాలని, పట్టణ పేదలకు కూడా ఈ చట్టాన్ని వర్తింపజేయాలని కోరారు. నిధులు పూర్తిగా కేంద్ర ప్రభుత్వమే భరించాలని, చట్టం అమలు బాధ్యతను కూడా కేంద్ర ప్రభుత్వమే తీసుకోవాలని జహంగీర్ డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నర్సింహం, బట్టుపల్లి అనురాధ, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మాటూరి బాలరాజు, కల్లూరి మల్లేశం, జెల్లెల పెంటయ్య, బూరుగు కృష్ణారెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు యండి పాషా, గంగాదేవి సైదులు, గోశిక కరుణాకర్, అవ్వారు రామేశ్వరి, సిరిపంగి స్వామి, కొమటిరెడ్డి చంద్రారెడ్డి, బొల్లు యాదగిరి, బొడ్డుపల్లి వెంకటేష్, మద్దెల రాజయ్య, దొడ యాదిరెడ్డి, గుండు వెంకట్ నర్సు, మాయ కృష్ణ, గడ్డం వెంకటేష్, మధ్యపురం రాజు, రాచకొండ రాములమ్మ, వనం ఉపేందర్, కోట రామచంద్రారెడ్డి, గణపతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## కాంగ్రెస్‌లోకి వలసల జోరు

- చౌటుప్పల్‌లో పెరుగుతున్న 'హస్తం' బలం

**చౌటుప్పల్, ఫిబ్రవరి 1 (తొలివెలుగు):** చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలో కాంగ్రెస్ పార్టీకి వలసల జోరు కొనసాగుతోంది. లింగోజిగూడెం గ్రామానికి చెందిన బీజేపీ నేతలు పిల్ల బాబు, సుమిత్ర, శంకరమ్మలతో పాటు, గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు అన్నాసిపేట లింగస్వామి, అనిల్, మౌనిక, దర్శనం వెంకటేష్‌లు ఆదివారం కాంగ్రెస్ పార్టీలో చేరి రాజకీయంగా కీలక పరిణామానికి నాంది పలికారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు బి.ఎన్. రెడ్డి నూతనంగా పార్టీలో చేరిన నేతలకు పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు ప్రజల్లో విశ్వాసాన్ని పెంచుతున్నాయని అన్నారు. అదే విశ్వాసంతో తాము కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు వెల్లడించారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చిత్తశుద్ధితో పనిచేస్తామని నూతన సభ్యులు స్పష్టం చేశారు. రానున్న ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన ముఖ్య నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొని నూతనంగా పార్టీలో చేరిన నేతలకు ఘన స్వాగతం పలికారు. ఈ చేరికలతో చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలో కాంగ్రెస్ పార్టీ మరింత బలపడుతుందని రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.



## భవానీ శంకర స్వామి బ్రహ్మోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ


- ఈనెల 14 నుంచి 17 వరకు రెడ్లరేపాకలో మహోత్సవాలు



**వలిగొండ, ఫిబ్రవరి 1 (తొలివెలుగు):** వలిగొండ మండల పరిధిలోని రెడ్లరేపాక గ్రామంలో మహాశివరాత్రి సందర్భంగా ఈనెల 14 నుంచి 17 వరకు నిర్వహించనున్న శ్రీ భవానీ శంకర స్వామి బ్రహ్మోత్సవాల వాల్ పోస్టర్లను ఆదివారం ఆలయ కమిటీ చైర్మన్ చెవ్వ బిక్షపతి ఆధ్వర్యంలో శ్రీ భవానీ శంకర స్వామి ఆలయ ప్రాంగణంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చైర్మన్ చెవ్వ బిక్షపతి మాట్లాడుతూ.. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని నాలుగు రోజుల పాటు శ్రీ భవానీ శంకర స్వామి వారి బ్రహ్మోత్సవాలు కన్నుల పండువగా నిర్వహించనున్నట్లు తెలిపారు. స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి అనుగ్రహం పొందాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ దేశబోయిన బాలస్వామి, ఉప సర్పంచ్, మాజీ ఎంపీటీసీ నోముల మల్లేష్ (శివ స్వామి), దేశబోయిన సూర్యనారాయణ, మాద శంకర్ గౌడ్, వార్డు మెంబర్ కొండం కృష్ణమూర్తి, పంతంగి కిష్టయ్య, ఖమ్మంపాటి రమేష్, కోమళ్ళ మచ్చగిరి, దేశబోయిన మల్లయ్య, పొన్నం రమేష్, గంధమల్ల పోచయ్య, సుక్క స్వామి, జువ్వగాని మధు, సాయినాథ్, శివ స్వాములు బాలరాజు, మత్స్యగిరి, నవీన్, బాబి తదితరులు పాల్గొన్నారు.

## లింగరాజుపల్లిలో బెల్ట్ షాపుల మూసివేతకు తీర్మానం

**వలిగొండ, ఫిబ్రవరి 1 (తొలివెలుగు):** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలంలోని లింగరాజుపల్లి గ్రామంలో బెల్ట్ షాపులను పూర్తిగా మూసివేయాలని గ్రామస్తులు ఏకగ్రీవంగా తీర్మానించారు. ఆదివారం పంచాయతీ కార్యాలయ ఆవరణలో గ్రామపంచాయతీ పాలకవర్గం, మహిళలు, గ్రామ నాయకులు, ప్రజలు సమావేశమై ఈ కీలక నిర్ణయం తీసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామ నాయకులు మాట్లాడుతూ.. గ్రామంలో బెల్ట్ షాపుల ద్వారా మద్యం విచ్చలవిడిగా విక్రయమవడంతో స్థానిక యువకులు మద్యానికి బానిసలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మద్యం కారణంగా కుటుంబాల్లో కలహాలు, ఆరోగ్య సమస్యలు, ప్రమాదాలు పెరుగుతున్నాయని తెలిపారు. ఈ పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని గ్రామ సమిష్టి నిర్ణయంతో బెల్ట్ షాపుల మూసివేతకు తీర్మానం చేసినట్లు పేర్కొన్నారు. తీర్మానం మేరకు ఇకపై గ్రామంలో బెల్ట్ షాపుల ద్వారా మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని గ్రామస్తులు హెచ్చరించారు. గ్రామంలో శాంతి, భద్రత, యువత భవిష్యత్తు దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో గ్రామ సర్పంచ్ బొడిగె లింగస్వామి, మాజీ సర్పంచ్ మైసయ్య, ఉపసర్పంచ్ బంగపట్ల జయ, వార్డు మెంబర్లు, గ్రామ సెక్రటరీ తండ రేణుకతో పాటు గ్రామ ప్రజలు, గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.





## కేసీఆర్‌ను సిట్ విచారణకు పిలవడం కక్షపూరితమే

- అక్రమ సిట్ విచారణకు వ్యతిరేకంగా వలిగొండలో బీఆర్ఎస్ ధర్నా

**వలిగొండ, ఫిబ్రవరి 1 (తొలివెలుగు):** బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను సిట్ విచారణకు పిలవడం కక్షపూరితమైన చర్యేనని బీఆర్ఎస్ నేతలు ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయ కక్షసాధింపులో భాగంగానే కేసీఆర్‌పై అక్రమంగా సిట్ విచారణ చేపడుతోందని మండిపడ్డారు. కేటీఆర్ ఆదేశానుసారం, పైళ్ల శేఖర్ రెడ్డి పిలుపుమేరకు బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు తుమ్మల వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో వలిగొండ పట్టణ కేంద్రంలో కేసీఆర్‌పై సిట్ విచారణకు వ్యతిరేకంగా నిరసన ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షులు తుమ్మల వెంకట్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ మొగుళ్ల శ్రీనివాస్ మాట్లాడుతూ.. కేసీఆర్ పదేళ్ల పాలనలో అభివృద్ధి, సంక్షేమ రంగాల్లో తెలంగాణను దేశానికే ఆదర్శంగా నిలిపారని అన్నారు. పరిపాలన చేతకాకపోయినా కాంగ్రెస్ ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి కలిసి కేసీఆర్‌పై కక్షపూరితంగా అక్రమ సిట్ విచారణకు పిలవడం దుర్మార్గమైన చర్యగా అభివర్ణించారు. ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయడంలో విఫలమైన ప్రభుత్వం, తన వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి కేసీఆర్‌పై నిందలు మోపుతూ చిల్లర రాజకీయాలకు పాల్పడుతోందని వారు విమర్శించారు. వెంటనే సిట్ విచారణను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు పైళ్ల రాజవర్ధన్ రెడ్డి, వంగాల వెంకన్న గౌడ్, మాజీ జడ్పీటీసీ మొగుళ్ల శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ పల్సం రమేష్ గౌడ్, పట్టణ అధ్యక్షులు ఎండి అప్రోచ్, నాయకులు ఎలిమినేటి జంగారెడ్డి, కొమురెల్లి సంజీవరెడ్డి, కీసర్ల సత్తిరెడ్డి, కొండూరు వెంకటేశం గౌడ్, ఐటీ పాముల ప్రభాకర్, సర్పంచులు రాపోలు గోపి, బుడిగె లింగస్వామి, ఆవుల నరసింహ, జడిగే బిక్షపతి, తిరుమలేష్, సోషల్ మీడియా అధ్యక్షులు కూచిమల్ల సుధాకర్, పబ్బు వెంకటరమణ, ఎస్సీ సెల్ అధ్యక్షులు ఎడవెల్లి శాంతి కుమార్, బలుగూరు నరేష్ రెడ్డి, పోలపాక సత్యనారాయణ, అసిరెడ్డి జనార్ధన్ రెడ్డి, గంగారం రమేష్, కాసుల పెద్దలు పబ్బు స్వామి, మల్లం నరేష్, నాగిళ్ల యాదగిరి, కూచుమల్ల నాగేష్, కడివేరి యాదగిరి, మొగిలిపాక రమేష్, చెవ్వ వెంకటేశం, శంకర్ రెడ్డి, పబ్బు బాలకృష్ణ, నీలం నరేందర్, మండల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## తొలిరోజు ఆరుగురు అభ్యర్థుల నామినేషన్ల ఉపసంహరణ

- వివరాలు వెల్లడించిన మున్సిపల్ కమిషనర్ జి. వెంకటరామ్ రెడ్డి

**చౌటుప్పల్, ఫిబ్రవరి 1 (తొలివెలుగు):** చౌటుప్పల్ మున్సిపాలిటీ ఎన్నికల ప్రక్రియలో భాగంగా నామినేషన్ల ఉపసంహరణ తొలిరోజైన ఆదివారం ఆరుగురు అభ్యర్థులు తమ నామినేషన్లను వెనక్కి తీసుకున్నారు. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్ జి.వెంకటరామ్ రెడ్డి వివరాలు వెల్లడించారు. 5వ వార్డు నుంచి కొండూరు వెంకటేశం, 10వ వార్డు నుంచి వసనం ఎల్లుబాయి, 18వ వార్డు నుంచి కరెంటోతు రవీందర్, రాతుల సోను నాయక్, 19వ వార్డు నుంచి వర్కాల రాము, 20వ వార్డు నుంచి ఎస్.కె. జానీ బాబా నామినేషన్లు ఉపసంహరించుకున్నట్లు తెలిపారు. గడువు ముగిసిన అనంతరం బరిలో నిలిచే అభ్యర్థుల తుది జాబితాను ప్రకటిస్తామని ఈ సందర్భంగా జి. వెంకటరామ్ రెడ్డి పేర్కొన్నారు.






## మున్సిపల్ పోరు వేళ.. బీజేపీకి షాక్!

- హస్తం గూటికి మట్టపల్లి యాదగిరి

**చౌటుప్పల్, ఫిబ్రవరి 01 (తొలివెలుగు):** చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని రాజకీయ సమీకరణాలు మారుతున్నాయి. రెండో వార్డు బీజేపీ అధ్యక్షుడు మట్టపల్లి యాదగిరి ఆదివారం తన కుటుంబ సభ్యులతో కలిసి కాంగ్రెస్ పార్టీలో చేరారు. సీనియర్ నాయకులు సుర్వి నరేష్ గౌడ్, మాజీ ఎంపీపీ తాడూరి వెంకట్ రెడ్డి సమక్షంలో ఆయన హస్తం గూటికి చేరారు. రానున్న మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి సుర్వి మంజుల నరసింహ గౌడ్ విజయం కోసం శ్రమిస్తానని యాదగిరి ఈ సందర్భంగా తెలిపారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ ఉప్పు భద్రయ్య, సుర్వి ఆంజనేయులు గౌడ్, చౌటుప్పల్ పట్టణాధ్యక్షుడు సుర్వి నరసింహ గౌడ్, దోనకొండ కృష్ణ, గుత్తా శ్రీధర్ రెడ్డి, దొనకొండ నరసింహ, ఊదరి నరసింహ, కొసనం రాకేష్ రెడ్డి, బొంగు ప్రవీణ్ గౌడ్, సుర్వి మహేష్ గౌడ్, మట్టపల్లి శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌కు 'బిగ్ షాక్'.. బీఆర్ఎస్‌లోకి వలసలు!

- రాజీనామా చేసిన ఉమామహేశ్వరి, సాయిలు
- చౌటుప్పల్‌లో వేడెక్కిన మున్సిపల్ రాజకీయం

**చౌటుప్పల్, ఫిబ్రవరి 1 (తొలివెలుగు):** చౌటుప్పల్ మున్సిపాలిటీలో కాంగ్రెస్ పార్టీకి భారీ రాజకీయ ఎదురుదెబ్బ తగిలింది. కాంగ్రెస్ పార్టీకి చెందిన సీనియర్ నాయకులు చింతల ఉమా మహేశ్వరీ, సాయిలు ఆదివారం పార్టీ క్రియాశీల సభ్యత్వానికి రాజీనామా చేసి భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్)లో చేరారు. మునుగోడు మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి సమక్షంలో గులాబీ కండువా కప్పుకొని వారు బీఆర్ఎస్‌లోకి అధికారికంగా అడుగుపెట్టారు. ఈ సందర్భంగా నూతనంగా బీఆర్ఎస్‌లో చేరిన నేతలు మాట్లాడుతూ, చౌటుప్పల్ మున్సిపాలిటీ అభివృద్ధి బీఆర్ఎస్ పార్టీతోనే సాధ్యమని స్పష్టం చేశారు. ప్రజా సమస్యల పరిష్కారం, పట్టణాభివృద్ధి, మౌలిక వసతుల కల్పనలో బీఆర్ఎస్‌కు స్పష్టమైన విధానాలు ఉన్నాయని తెలిపారు. రానున్న మున్సిపల్ ఎన్నికల్లో చౌటుప్పల్‌లో బీఆర్ఎస్ జెండాను ఎగరేయడమే లక్ష్యంగా పనిచేస్తామని వెల్లడించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిన కాంగ్రెస్ పార్టీని విడిచి ప్రజలు, వివిధ పార్టీల నాయకులు బీఆర్ఎస్ వైపు ఆకర్షితులవుతున్నారని అన్నారు. చౌటుప్పల్ మున్సిపాలిటీలో బీఆర్ఎస్‌ను మరింత బలోపేతం చేసి గులాబీ జెండాను ఎగరేయడమే లక్ష్యంగా పనిచేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొని నూతనంగా పార్టీలో చేరిన నేతలను ఘనంగా స్వాగతించారు.





# ప్రజాక్షేత్రంలో కాంగ్రెస్‌కు పరాభవం తప్పదు!

- కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి నల్ల జెండాలతో నిరసన..
- జాతీయ రహదారిపై రాస్తారోకో



**చౌటుప్పల్, ఫిబ్రవరి 1 (తొలివెలుగు):** తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కక్షసాధింపు రాజకీయాలకు పాల్పడుతోందని మునుగోడు మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి ఆరోపించారు. బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ రాష్ట్ర సాధకుడు, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ఫోన్ ట్యాపింగ్ కేసులో నోటీసులు జారీ చేయడంపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ కక్షపూరిత చర్యలను నిరసిస్తూ చౌటుప్పల్ పట్టణంలో బీఆర్ఎస్ శ్రేణులు నల్ల జెండాలతో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని జాతీయ రహదారిపై రాస్తారోకో చేపట్టడంతో కొంతసేపు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ప్రభుత్వ వ్యతిరేక నినాదాలతో రహదారిని దద్దరిల్లించారు. ఈ సందర్భంగా కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ.. కేసీఆర్‌కు నోటీసులు ఇవ్వడం అంటే తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని దెబ్బతీయడమేనని మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణాలకు తెగించి పోరాడిన నాయకుడిపై విచారణ పేరుతో నోటీసులు జారీ చేయడం అమానుష చర్యగా అభివర్ణించారు. ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైన కాంగ్రెస్ ప్రభుత్వం, తన వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి బీఆర్ఎస్ నాయకులపై అక్రమ కేసులు, నోటీసులు వేస్తోందని ఆరోపించారు. ఇటువంటి చర్యలతో బీఆర్ఎస్ గొంతు నొక్కలేరని, తగిన సమయంలో ప్రజలే కాంగ్రెస్ ప్రభుత్వానికి గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ చింతల దామోదర్ రెడ్డి, బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు గిర్కటి నిరంజన్ గౌడ్, మున్సిపల్ కన్వీనర్ బొమ్మిరెడ్డి వెంకట్ రెడ్డి, మాజీ గ్రంథాలయ చైర్మన్ ఊడుగు మల్లేశం, రైతుబంధు మండల మాజీ అధ్యక్షుడు కొత్త పర్వతాలు యాదవ్, మాజీ జిల్లా డైరెక్టర్ ముప్పిడి శ్రీనివాస్ గౌడ్, మాజీ సర్పంచ్ ఎం. దయాకరాచారి, నాయకులు సుర్కంటి శంకర్ రెడ్డి, చింతల మైపాల్ రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# వేడుకగా చలమల్ల కృష్ణారెడ్డి పుట్టినరోజు

- క్యాంపు కార్యాలయంలో వెల్లువెత్తిన అభిమానులు
- ఆందోళ్ మైసమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు
- ప్రజాసేవలో ముందుంటా: కృష్ణారెడ్డి



**చౌటుప్పల్, ఫిబ్రవరి 1 (తొలివెలుగు):** కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు చలమల్ల కృష్ణారెడ్డి జన్మదిన వేడుకలు ఆదివారం చౌటుప్పల్ మండలం దామెరలోని ఆయన వ్యక్తిగత క్యాంపు కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, ప్రజాప్రతినిధులు, అభిమానులు భారీ సంఖ్యలో తరలివచ్చి కృష్ణారెడ్డికి పూలమాలలు, శాలువాలతో శుభాకాంక్షలు తెలిపారు. జన్మదిన వేడుకలకు ముందు దండు మల్కాపురం గ్రామంలోని ఆందోళ్ మైసమ్మ ఆలయంలో చలమల్ల కృష్ణారెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం క్యాంపు కార్యాలయంలో కేక్ కట్ చేసి వేడుకలను జరుపుకున్నారు. ఈ కార్యక్రమం సందర్భంగా దామెర క్యాంపు కార్యాలయం సందడిగా మారింది. ఈ సందర్భంగా చలమల్ల కృష్ణారెడ్డి మాట్లాడుతూడ తనపై చూపిస్తున్న అభిమానానికి, ప్రేమకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి నిరంతరం శ్రమిస్తానని, ప్రజాసేవే తన లక్ష్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ అధికార ప్రతినిధి దోడ శ్రీనివాస్ రెడ్డి, చలమల్ల నర్సింహారెడ్డి, గూడూరి వెంకటరెడ్డి, సుర్గి నరసింహాగౌడ్, పాలకూర నాగరాజు, బిట్టు సత్యనారాయణతో పాటు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో అభిమానులు పాల్గొన్నారు.



# విద్యార్థుల భవిష్యత్తుకు ఎంజేపీటీలే బంగారు బాటలు





- గురుకుల విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరాలి
- లక్ష్యసాధనలో విద్యార్థులు ముందుండాలి: ప్రిన్సిపల్ బి. శిరీష
- ఘనంగా తూప్రాన్‌పేట ఎంజేపీటీ వార్షికోత్సవం.. మ్యాగజైన్ ఆవిష్కరణ
- కార్యక్రమానికి హాజరైన తూప్రాన్‌పేట సర్పంచ్ బక్కతట్ల రాధిక శ్రీశైలం
- పాట పాడి విద్యార్థుల్లో ఉత్సాహం నింపిన ఆర్‌సీఓ గౌతమ్ కుమార్ రెడ్డి



**చౌటుప్పల్, ఫిబ్రవరి 1 (తొలివెలుగు):** మహాత్మ జ్యోతిబాపూలే గురుకులాల్లో చదువుకునే విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు పడతాయని, విద్యార్థుల జీవితానికి పునాది పాఠశాల దశలోనే ఏర్పడుతుందని మహాత్మ జ్యోతిబాపూలే హైదరాబాద్ ఆర్సీఓ గౌతమ్ కుమార్ రెడ్డి అన్నారు. శనివారం చౌటుప్పల్ మండలం తూప్రాన్‌పేట గ్రామ పరిధిలోని ఎంజేపీటీ ముషీరాబాద్ అండ్ చార్మినార్ పాఠశాల - కళాశాల 2026 వార్షికోత్సవ కార్యక్రమాలు ప్రిన్సిపల్ బుసిరెడ్డి శిరీష ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తూప్రాన్‌పేట గ్రామ సర్పంచ్ బక్కతట్ల రాధిక - శ్రీశైలం దంపతులు, హైదరాబాద్ ఆర్సీఓ గౌతమ్ కుమార్ రెడ్డి, ఏజీవోలు వెంకట్రావు, వెంకటేశ్వర్ రెడ్డి, జీహెచ్ఎం రిటైర్డ్ అధికారి సీహెచ్ రవీంద్రచారి హాజరయ్యారు. పాఠశాల ప్రిన్సిపల్ బి.శిరీషతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ.. గురుకుల పాఠశాలలో చదువుకున్న అనేక మంది పూర్వ విద్యార్థులు నేడు ఉన్నత స్థానాల్లో స్థిరపడ్డారని తెలిపారు. తల్లిదండ్రులు, పాఠశాల, ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకొచ్చే విధంగా విద్యార్థుల నడవడిక ఉండాలన్నారు. పోటీ ఉన్న చోట పోరాడే తత్వాన్ని విద్యార్థులు అలవర్చుకోవాలని సూచించారు. విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణతో మెలిగి ఉన్నత శిఖరాలను అధిరోహించి దేశానికి సేవ చేయాలని ఉద్బోధించారు. వార్షికోత్సవంలో భాగంగా హైదరాబాద్ ఆర్సీఓ గౌతమ్ కుమార్ రెడ్డి విద్యార్థులను ఉత్సాహపరిచే గీతం పాడి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. అనంతరం పాఠశాలకళాశాల మ్యాగజైన్‌ను విశిష్ట అతిథుల చేతుల మీదుగా ఆవిష్కరించారు. మ్యాగజైన్‌లోని వ్యాసాలు, ఛాయాచిత్రాలను పరిశీలించిన అతిథులు ప్రిన్సిపల్ బి. శిరీషను ప్రత్యేకంగా అభినందించారు.

**విద్యతోనే ఉన్నత స్థానాలు: సర్పంచ్ బక్కతట్ల రాధిక శ్రీశైలం**

విద్యార్థులు కష్టపడి చదివితే భవిష్యత్తులో ఉన్నత స్థానాల్లో నిలుస్తారని తూప్రాన్‌పేట గ్రామ సర్పంచ్ బక్కతట్ల రాధిక శ్రీశైలం తెలిపారు. పాఠశాల వార్షికోత్సవం విద్యార్థుల ప్రతిభను, పాఠశాల విజయాలను ప్రదర్శించే అద్భుత వేదిక అని పేర్కొన్నారు. గురుకుల విద్యార్థులు క్రమశిక్షణకు మారుపేరుగా నిలుస్తున్నారని, దేశ విదేశాల్లో ఉన్నత స్థాయిలో స్థిరపడిన గురుకుల పూర్వ విద్యార్థులు ఎంతోమందిగా ఉన్నారని గుర్తు చేశారు. రానున్న పది, ఇంటర్ వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. పాఠశాలకు తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. విద్యార్థులకు బహుమతులు అందజేసి, సాంస్కృతిక కార్యక్రమాలను అభినందించారు.

**లక్ష్యసాధనతోనే శిఖరాలు: ప్రిన్సిపల్ బి.శిరీష**

విద్యార్థులు లక్ష్యాలను నిర్దేశించుకుని అత్యున్నత శిఖరాలను చేరుకోవాలని పాఠశాల ప్రిన్సిపల్ బి. శిరీష అన్నారు. పది, ఇంటర్ విద్యార్థులు రానున్న పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. మహాత్మ జ్యోతిబాపూలే పాఠశాల పేరు ప్రతిష్టలను రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఇనుమడింపజేయాలని విద్యార్థులకు సూచించారు. పూర్వ విద్యార్థులను ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. కార్యక్రమానికి హాజరైన విశిష్ట అతిథులను శాలువాలు, మెమొంటోలతో ఘనంగా సన్మానించారు. క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ఉపాధ్యాయులకు ప్రిన్సిపల్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ బక్కతట్ల రాధిక శ్రీశైలం, హైదరాబాద్ ఆర్సీఓ గౌతమ్ కుమార్ రెడ్డి, ఏజీవోలు వెంకట్రావు, వెంకటేశ్వర్ రెడ్డి, రిటైర్డ్ అధికారి సీహెచ్ రవీంద్రచారి, పాఠశాల - కళాశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.



# మున్సిపాలిటీలో ఎగిరే తొలి జెండా కాంగ్రెస్ దే

- పార్టీని నమ్ముకున్న ప్రతి ఒక్కరికి అవకాశం వస్తుంది
- మాజీ ముఖ్యమంత్రి రాజశేఖరన్న ఉన్నప్పటి నుంచే కమ్యూనిస్టులతో అనుబంధం ఉంది
- అశ్వారావుపేట మున్సిపాలిటీ క్లీన్ స్వీప్ చేసి ముఖ్యమంత్రి కె కానుకగా ఇవ్వాలి...
- కొండ సురేఖ... రాష్ట్ర దేవాదాయ, అటవీశాఖ మంత్రి, ఉమ్మడి ఖమ్మం జిల్లా ఇన్చార్జ్
- కార్యకర్తల సూచనల మేరకే అభ్యర్థుల ఎంపిక.. ఎమ్మెల్యే జారె



**అశ్వారావుపేట, తొలివెలుగు):** అశ్వారావుపేట మున్సిపాలిటీ లో ఎగిరే తొలి జెండా కాంగ్రెస్ పార్టీ దేనని ఇది మన లెక్క కాంగ్రెస్ మున్సిపాలిటీ కైవసం చేసుకోవడం పక్కా అని రాష్ట్ర దేవాదాయ, అటవీశాఖ మంత్రి ఉమ్మడి ఖమ్మం జిల్లా ఇన్చార్జి కొండా సురేఖ అన్నారు. ఆదివారం స్థానిక శాసనసభ్యులు జారే ఆదినారాయణ అధ్యక్షతన పట్టణంలోని భద్రాచలం రోడ్డులో శ్రీ శ్రీ ఫంక్షన్ హాల్ లో మున్సిపాలిటీ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన కొండా సురేఖ మాట్లాడుతూ కార్యకర్తల కష్టంతోనే ఎమ్మెల్యేలు మంత్రులుగా మేము ఈ స్థానంలో ఉన్నామని ఇప్పుడు మీకు ప్రజాప్రతినిధులుగా అవకాశం వచ్చిందన్నారు. ప్రజాక్షేత్రంలో నిలిచిన మీరు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ అభివృద్ధి పథకాలతో ప్రజలకు వివరిస్తూ స్థానిక సమస్యలను గుర్తిస్తూ గెలుపుకు బాట వేసుకోవాలన్నారు. కమ్యూనిస్టులు నిరంతరం ప్రజా సమస్యలపైనే పోరాటం చేస్తూ వారి సమస్యలను పరిష్కరించడమే ధ్యేయంగా పని చేస్తారన్నారు . మాజీ ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి కమ్యూనిస్టులకు సముచిత స్థానం కల్పించారని ఇప్పుడు ఈ మున్సిపాలిటీలో కాంగ్రెస్ పార్టీతో కలిసి వారు నడవడం మంచి పరిణామం అన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఉన్న ముగ్గురు మంత్రుల సహకారంతో స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ఆధ్వర్యంలో పూర్తిస్థాయిలో మున్సిపాలిటీ గెలిచి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి కానుకగా ఇవ్వాలన్నారు.

**కార్యకర్తల సూచనల మేరకే అభ్యర్థుల ఎంపిక.. ఎమ్మెల్యే జారే ఆదినారాయణ**

అశ్వారావుపేట మున్సిపాలిటీ పరిధిలో ప్రతి వార్డులోనూ పది మంది క్రియాశీలక కార్యకర్తలను ఎంపిక చేసి వారి సూచనలు, అభిప్రాయాలను పరిగణంలోనికి తీసుకొని పార్టీలో పోటీ చేసే అభ్యర్థులను ఎంపిక చేయడం జరిగిందన్నారు. 22 వార్డులలో గెలుపే లక్ష్యంగా పనిచేస్తామని పూర్తిస్థాయిలో మున్సిపాలిటీని గెలిపించుకొని సత్తా చాటుతామన్నారు . ఈ కార్యక్రమంలో మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు తోట ప్రసన్న ఆత్మ కమిటీ చైర్మన్ సుంకవల్లి వీరభద్రరావు, పిసిసి నాయకులు ఏనుగులు అర్జున్ రావు జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు చీకటి కార్తీక్ నియోజకవర్గ నాయకులు జూపల్లి రమేష్ మండల అధ్యక్షులు తుమ్మా రాంబాబు సీనియర్ నాయకులు చిన్నంశెట్టి సత్యనారాయణ, జూపల్లి ప్రమోద్, ఆకుల శ్రీను పాల్గొన్నారు.



## వరల్డ్‌లో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మారడమే లక్ష్యం..

పార్లమెంట్‌లో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై ప్రధాని మోడీ విమర్శలు ప్రశంసలు కురిపించారు. భారతదేశం అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థగా మారడమే లక్ష్యం కాదని.. ప్రపంచంలో మూడో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించడమే లక్ష్యం అని ప్రధాని మోడీ అన్నారు. ఈ బడ్జెట్ అంతా మానవ కేంద్రీకృతమైందని.. విప్లవాత్మక సంస్కరణలతో భారతదేశం పునాదిని బలోపేతం చేస్తుందన్నారు. చారిత్రాత్మకమైన బడ్జెట్‌గా అభివర్ణించారు. దీర్ఘకాలిక వృద్ధిని వేగవంతం చేయడానికి దోహదపడుతుందని పేర్కొన్నారు. బడ్జెట్‌లోని ప్రతిపాదనలు ఆర్థిక వ్యవస్థను ఉత్తేజపరుస్తాయని.. అంతేకాకుండా పౌరులను శక్తివంతం చేస్తాయన్నారు. భారతదేశ యువత కొత్త శిఖరాలను అధిరోహించడానికి కొత్త అవకాశాలను ఇస్తాయని పేర్కొన్నారు. భారతదేశంలోని ధైర్యవంతులైన, ప్రతిభావంతులైన యువతకు ఎదగడానికి ఓపెన్ ఆకాశాలను అందిస్తాయని చెప్పారు. భారతదేశంలోని 140 కోట్ల మంది పౌరులు వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థగా ఉంటుందన్నారు. ఈ బడ్జెట్ అపార అవకాశాలకు దారితీసే మార్గం అని.. ఇది నేటి ఆకాంక్షలను వాస్తవంగా మారుస్తుందని పేర్కొన్నారు. భారతదేశ ఉజ్వల భవిష్యత్తుకు పునాదిని బలపరుస్తుందని ప్రధాని మోడీ అన్నారు. మహిళా సాధికారతకు నిదర్శనంగా ఉందని.. వరుసగా తొమ్మిదిసార్లు దీనిని లోక్‌సభలో ప్రవేశపెట్టి నిర్మలాసీతారామన్ రికార్డు సృష్టించారని ప్రధాని మోడీ కొనియాడారు.

## బెంగాల్‌కు ఒక్క పైసా లేదు.. చెత్త బడ్జెట్



కేంద్ర బడ్జెట్‌పై విపక్షాల నుంచి పెద్ద ఎత్తున విమర్శలు వస్తున్నాయి. 2026-27 ఆర్థిక సంవత్సరానికి గానూ మొత్తంగా రూ. 53.5 లక్షల కోట్ల కేంద్ర బడ్జెట్‌ను ఆదివారం ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టారు. అయితే ఈ బడ్జెట్‌ను పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తీవ్రంగా విమర్శించారు. ఈ బడ్జెట్‌కు దిశానిర్దేశం లేదనిడ ఇందులో అసలు ఏమీ లేదని ధ్వజమెత్తారు. చెత్త బడ్జెట్‌గా అభివర్ణించారు. బెంగాల్‌కు ఒక్క పైసా కూడా ఇవ్వలేదని మండిపడ్డారు. పురులియాలోని జంగల్‌మహల్ జంగల్ సుందరి ప్రాజెక్టును ఉద్దేశిస్తూ కేంద్రం నుంచి ఎటువంటి మద్దతు లేకుండానే ఆర్థిక కారిడార్ కోసం ఇప్పటికే రూ.72,000 కోట్ల పెట్టుబడులు పెట్టినట్టు చెప్పారు. దేశాన్ని ప్రభుత్వం తప్పుదారి పట్టించిందనిడ బెంగాల్‌కు రావాల్సిన నిధులను లాక్కుందని ఆరోపించారు. కొత్త ఆర్థిక కారిడార్లపై చేసిన వాదనలను తోసిపుచ్చారు. ప్రజలకు నిజమైన ప్రయోజనాలను అందించడానికి బదులుగా 'కఠినమైన అబద్ధాలు' చెప్పిందని.. "మాటల గారడీ" ఉపయోగించిందని మండిపడ్డారు. బడ్జెట్‌లో ప్రస్తావించిన ప్రాజెక్ట్‌లు ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో జరుగుతున్నాయని వివరించారు. మూడు కారిడార్ల గురించి చెప్పింది పూర్తిగా అబద్ధాల చెత్తగా అభివర్ణించారు. రాష్ట్రం నుంచి పెద్ద మొత్తంలో పన్ను వసూలు చేసినప్పటికీ.. బెంగాల్ బకాయిలను విడుదల చేయడంలో కేంద్రం విఫలమైందని ఆరోపించారు. "వారు బెంగాల్‌కు ఒక్క పైసా కూడా ఇవ్వలేదు. ఒకే ఒక పన్ను +ూ ఉంది. వారు మా డబ్బును లాక్కొని.. మాకు డబ్బు ఇస్తున్నామని పెద్ద పెద్ద మాటలు చెబుతున్నారు. ఇది మా డబ్బు" అని పేర్కొన్నారు. పశ్చిమ బెంగాల్‌కు కేంద్రం రూ. 2 లక్షల కోట్లకు పైగా బాకీ ఉందని.. కేంద్ర ప్రభుత్వం చట్టబద్ధమైన నిధులను నిలిపివేసిందని ఆరోపించారు. "వారు బెంగాల్ నుంచి ఏమి సేకరిస్తున్నారో.. వారు మాకు పూర్తి నిధులు ఇవ్వడం లేదు." అని అన్నారు.

## ఉద్యోగాలపై AI ప్రభావం..



కేంద్ర ప్రభుత్వం ఆదివారం ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్ 2026లో సేవా రంగంలో ఉద్యోగాలపై ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (AI)తో పాటు ఇతర లేటెస్ట్ టెక్నాలజీ ఎలాంటి ప్రభావం చూపిస్తుందనే దానిపై అంచనా వేయడానికి ఒక ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. 2047 నాటికి ప్రపంచ సర్వీస్ సెక్టార్ లో 10 శాతం వాటా సాధించే లక్ష్యాన్ని భారత్ పెట్టుకుంది. ఇందులో భాగంగా ఐటీ, ఫైనాన్స్, పర్యాటక, ఆరోగ్య సంరక్షణ, లాజిస్టిక్స్‌తో పాటు ఇతర రంగాల్లో ఏఐ, ఆటోమేషన్, డిజిటర్ ట్రాన్స్‌ఫర్మేషన్ మొదలైనవి ఉపాధిపై ఎలాంటి ప్రభావం చూపిస్తాయనే దానిపై ప్యానెల్ అధ్యయనం చేస్తుంది. వికసిత భారత్ విధానాలకు అనుగుణంగా భారత్ దీర్ఘకాలిక వ్యూహాలు, వృద్ధికి అనుగుణంగా స్కిల్ డెవలప్మెంట్ మార్గాలు, విధానపరమైన అవసరాలను ఈ ప్యానెల్ సిఫారసు చేస్తుందని భావిస్తున్నారు. మరోవైపు, వ్యవసాయ సామర్థ్యాన్ని పెంచడానికి ప్రభుత్వం ఏఐ-ఆధారిత సాధనాలను ప్రారంభించాలని ప్రతిపాదించింది.

# దేశ రక్షణకు భారీగా నిధులు..



దేశ రక్షణకు 2026 కేంద్ర బడ్జెట్‌లో నిధులను పెంచారు.రక్షణ మంత్రిత్వ శాఖ 2026-27కు సంబంధించి రూ. 7.8 లక్షల కోట్లు కేటాయించారు. ఇది గతేడాదితో పోలిస్తే ఏకంగా 15 శాతం ఎక్కువ. ఈ బడ్జెట్‌లో భారత సైన్యం ఆధునీకీకరణ కోసం రూ. 2.19 లక్షల కోట్లు కేటాయించారు. ఇది గతేడాదితో పోలిస్తే ఏకంగా 21.84 శాతం పెరుగుదల. సరిహద్దుల్లో ఎదురవుతున్న సవాళ్లు, సీమాంతర ఉగ్రవాదం, పాకిస్తాన్, చైనాలతో ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో డిఫెన్స్ బడ్జెట్‌ను పెంచారు. బడ్జెట్‌లో ముఖ్యమైన కేటాయింపులను పరిశీలిస్తే.. విమానాలు, ఏరో ఇంజన్ల కోసం రూ. 63,733 కోట్లను కేటాయించారు. రక్షణ సేవల రెవెన్యూ ఖర్చులు అంటే రోజూవారీ నిర్వహణ, ఇంధనం, మందుగుండు సామాగ్రి, మరమ్మతులు, సహాయక సిబ్బంది జీతాలు మొదలైన వాటికి 17.24 శాతం నిధుల్ని పెంచారు. పెన్షన్ల కోసం గతేడాదితో నిధులతో పోలిస్తే 6.53 శాతం పెంచి, రూ. 1.71 లక్షల కోట్లు కేటాయించారు. రక్షణ మూలధన వ్యయంలో 28% పెరుగుదల రూ. 2.31 లక్షల కోట్లకు చేరుకోవడం కీలకమైన అంశం. ఇది అధునాతన ఆయుధ వ్యవస్థలను సంపాదించడానికి ప్రాధాన్యతనిచ్చారు. ఇది దేశీయ రక్షణ తయారీని వేగవంతం చేయడానికి మద్దతునిస్తుంది. రక్షణ బడ్జెట్ మొత్తం జీడీపీలో 11 శాతం ఉంది. ఇది 2025-26లో 8 శాతం మాత్రమే. రక్షణ రంగానికి చెందిన యూనిట్లు విమానాల భాగాల తయారీ కోసం దిగుమతి చేసుకునే ముడిపదార్థాలపై ప్రాథమిక కస్టమ్స్ సుంకాన్ని మినహాయించాలని ఆర్థిక మంత్రి తన బడ్జెట్ ప్రసంగంలో చెప్పారు. ఈ భాగాలు ముఖ్యంగా మెయింటెనెన్స్, రిపేర్, ఓవర్ హాల్ అవసరాల కోసం ఉపయోగించబడుతాయి. ఆపరేషన్ సిందూర్ తర్వాత రక్షణ రంగానికి కేటాయించే నిధులు పెంచాల్సిన అవసరం ఉందని రక్షణ రంగ నిపుణులు భావిస్తున్నారు. బడ్జెట్‌కు ముందు రక్షణ మంత్రిత్వ శాఖ తమ నిధులను కనీసం 20 శాతం పెంపును కోరినట్లు సమాచారం. నివేదికల ప్రకారం, గత 26 ఏళ్లలో భారత రక్షణ వ్యయం ఏకంగా 40 శాతం కన్నా ఎక్కువ పెరిగింది. ఇందులో రక్షణ మూలధన వ్యయం ఎక్కువగా ఉంది.

## హైదరాబాద్‌కు 7 హై-స్పీడ్ రైల్ కారిడార్‌లు

బడ్జెట్‌లో మెరుగైన రైలు సౌకర్యాలకు కేంద్రం ప్రాధాన్యత ఇచ్చింది. ఆదివారం నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌లో 7 హై స్పీడ్ రైల్ కారిడార్లను ఏర్పాటు చేస్తున్నారు. ముఖ్యంగా హైదరాబాద్‌ను కలిపే మూడు కారిడార్లు ఉండటం గమనార్హం. బడ్జెట్‌లో మెరుగైన రైలు సౌకర్యాలకు కేంద్రం ప్రాధాన్యత ఇచ్చింది. ఆదివారం నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌లో 7 హై స్పీడ్ రైల్ కారిడార్లను ఏర్పాటు చేస్తున్నుట్లు ప్రకటించారు. హైదరాబాద్ కేంద్రంగా రెండు హై స్పీడ్ రైల్ కారిడార్లు ఉండటం గమనార్హం.

1. ముంబైపుణే
2. హైదరాబాద్‌బెంగళూరు
3. ఢిల్లీవారణాసి
4. వారణాసిసిలిగురి
5. పుణేహైదరాబాద్
6. హైదరాబాద్‌చెన్నై
7. చెన్నైబెంగళూరు

వేగవంతమైన, పర్యావరణపరంగా స్థిరమైన ప్రయాణాన్ని ప్రోత్సహించే లక్ష్యంతో ఏడు కారిడార్లను ఏర్పాటు చేయనున్నట్లు ఆర్థిక మంత్రి ప్రకటించారు. ప్రతిపాదిత కారిడార్లలో ప్రధాన ఆర్థిక, సాంస్కృతిక కేంద్రాల మధ్య కనెక్టివిటీ మెరుగుపడటంతో పాటు, సుదూర ప్రాంతాల మధ్య కాలుష్య రహిత ప్రయాణాన్ని ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరానికి రూ. 12.2 లక్షల కోట్లతో మూలధన వ్యయాన్ని ప్రకటించారు. దీంట్లో భాగంగానే హై స్పీడ్ రైలు నెట్వర్క్ ప్రకటన వచ్చింది. వీటితో పాటు రాబోయే ఐదేళ్లలో కొత్తగా 22 జాతీయ జలమార్గాల నిర్వహణను ఆమె ప్రతిపాదించారు. తూర్పున డంకునిని పశ్చిమాన సూరత్‌తో కలిపే కొత్త అంకితమైన తూర్పు-పశ్చిమ సరుకు రవాణా కారిడార్‌ను ప్రకటించారు.







## చిన్న, సన్నకారు రైతులకు ఆర్థిక మంత్రి శుభవార్త

చిన్న, సన్నకారు రైతులకు ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ శుభవార్త చెప్పారు. చిన్న, సన్నకారు రైతుల ఆదాయం పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు పార్లమెంట్ వేదికగా స్పష్టం చేశారు.. దివ్యాంగుల సంక్షేమం కోసం ప్రత్యేక చర్యలు చేపడతామన్నారు.. 500 రిజర్వాయర్లలో చేపల పెంపకం, అభివృద్ధికి పెద్ద పీట వేయనున్నారు. పశు సంవర్ధక శాఖలో భారీగా ప్రోత్సాహకాలు.. వ్యవసాయ ఆదాయం పెంచేందుకు అధిక విలువ పంటలకు ప్రోత్సాహం.. తీర ప్రాంతాల్లో కొబ్బరి, గంధం చెట్ల నాటకానికి ప్రోత్సాహం ఇస్తామని ప్రకటించారు.. కొబ్బరి ఉత్పత్తి పెంపునకు ప్రత్యేక ప్రోత్సాహక పథకం.. కాయలు కాయని చెట్ల స్థానంలో కొత్త చెట్ల నాటకానికి ప్రోత్సాహకాలు అందిస్తామని స్పష్టం చేశారు. ఇవాళ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టబోయే బడ్జెట్‌పై రైతులు మరో ఆశ పెట్టుకున్నారు. పంట పెట్టుబడి సాయం కింద కేంద్రం ఏటా అందించే పీఎం కిసాన్ సమ్మాన్ నిధి యోజన మొత్తాన్ని పెంచుతుందని. 2019లో ఈ పథకం ప్రారంభమైనప్పటి నుంచి పెట్టుబడి సాయం కింద కేంద్రం ఏటా రూ. 6 వేలు మాత్రమే అందిస్తుంది. దీనిని రూ. 8 వేలు లేదా 10 వేలకు పెంచాలని ఎప్పటినుంచో రైతులు డిమాండ్ చేస్తున్నారు. ఈ అంశంపై ఇంకా క్లారిటీ ఇవ్వలేదు.

# హిట్ కోసం విజయ్ దేవరకొండ ప్రయత్నాలు..




యూత్‌లో ప్రత్యేక ఫ్యాన్ బేస్ సంపాదించుకున్న రౌడీ స్టార్ విజయ్ దేవరకొండ కెరీర్‌లో మరో కీలక మలుపు చోటు చేసుకోనుంది. గత కొంతకాలంగా సరైన కమర్షియల్ హిట్ కోసం ఎదురుచూస్తున్న ఆయన, తాజాగా వరుస ప్రాజెక్టులతో బిజీ అవుతూ కొత్త స్ట్రాటజీని అమలు చేస్తున్నాడు. ఇటీవల విడుదలైన 'కింగ్‌డమ్' ఆశించిన ఫలితాన్ని ఇవ్వకపోవడంతో, ఇప్పుడు మరింత జాగ్రత్తగా కథల ఎంపికలో ముందుకు వెళు న్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో దర్శకుడు రవికిరణ్ కోలా తెరకెక్కిస్తున్న 'రౌడీ జనార్దన్' సినిమా ప్రత్యేకంగా నిలుస్తోంది. గ్రామీణ నేపథ్యంలో సాగే పీరియాడిక్ యాక్షన్ డ్రామాగా రూపొందుతున్న ఈ చిత్రం విజయ్ కెరీర్‌లో విభిన్నమైన ప్రయత్నంగా భావిస్తున్నారు. టైటిల్ అనౌన్స్‌మెంట్ వీడియోలో చూపించిన మాస్ ఎలిమెంట్స్, గ్రామీణ వాతావరణం సినిమాపై అంచనాలను ఒక్కసారిగా పెంచాయి.దఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాణ సంస్థ శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై దిల్ రాజు నిర్మిస్తున్నారు. భారీ బడ్జెట్‌తో పాటు బలమైన టెక్నికల్ టీమ్ పనిచేస్తుండటం విశేషం. హీరోయిన్‌గా కీర్తి సురేష్ ఎంపిక కావడం సినిమాకు అదనపు ఆకర్షణగా మారింది. నటీనటుల ఎంపిక విషయంలో దర్శకుడు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు ఇండస్ట్రీ వర్గాల సమాచారం.ఇక కథలో భావోద్వేగాలకు కీలకమైన పాత్రల కోసం అనుభవజ్ఞులైన నటులను తీసుకుంటున్నట్లు టాక్ వినిపిస్తోంది. సీనియర్ నటి శోభన ముఖ్యమైన పాత్రలో కనిపించనున్నారన్న వార్త సినిమాకు మరింత ప్రాధాన్యం తీసుకొచ్చింది. అలాగే సీనియర్ హీరో రాజశేఖర్ కూడా ప్రత్యేక పాత్రలో కనిపించే అవకాశాలున్నట్లు చర్చ నడుస్తోంది. భారీ తారాగణం, గ్రామీణ శైలిలో సాగే యాక్షన్ కథాంశం, పీరియాడిక్ టచ్ అన్నీ కలిసి 'రౌడీ జనార్దన్'ను విజయ్ దేవరకొండకు మాస్ కమ్బ్యాక్ మూవీగా నిలబెడతాయనే అంచనాలు వ్యక్తమవుతున్నాయి.



# అనుపమ సైలెంట్!

మలయాళ భామ అనుపమ పరమేశ్వరన్ ప్రధాన పాత్రలో ఏఆర్ జీవా డైరెక్టర్ గా పరిచయమవుతున్న సినిమా లాక్‌డౌన్. వాస్తవానికి ఈ సినిమా ఎప్పుడో రిలీజ్ కావాల్సింది. కానీ కొన్ని కారణాలతో పలు సార్లు వాయిదా పడి ఆఖరికి రేపు ప్రేక్షకుల ముందుకు రానుంది. సినీ ఇండస్ట్రీలో పోటీ విపరీతంగా పెరిగిన నేపథ్యంలో ఏ సినిమాకైనా ప్రమోషన్లు చాలా కీలకం. అందుకే ప్రతీ ఒక్కరూ తమ తమ సినిమాల్ని ప్రమోట్ చేయడానికి ఆసక్తి చూపిస్తూ ఉంటారు. కానీ ఈ సినిమా విషయంలో అనుపమ పరమేశ్వరన్ సైలెంట్ గా ఉంది. ఈ సినిమా రిలీజ్ డేట్ అనౌన్స్ చేసినప్పుడు కానీ, దానికి ముందు గానీ, ఈ సినిమా గురించి ఆమె సోషల్ మీడియాలో ఎలాంటి పోస్ట్ చేయలేదు. లైకా ప్రొడక్షన్ ప్రమోషన్స్ విషయంలో తమ వంతు కష్టం తాము పడుతున్నప్పటికీ, అనుపమ మాత్రం ఎలాంటి ప్రమోషన్స్ చేయకపోవడం అందరినీ ఆలోచనలో పడేసింది. ఇవన్నీ చూస్తుంటే అనుపమకు, చిత్ర యూనిట్ కు మధ్య ఏదైనా ప్రాబ్లమ్ ఉందా అనే అనుమానాలొస్తున్నాయి. ఈ విషయంలో అనుపమ ఇప్పటికైనా క్లారిటీ ఇస్తుందేమో చూడాలి.

# స్పీడు పెంచిన రామ్ పోతినేని ..



ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని తెలుగు సినీ పరిశ్రమలో తనదైన స్టైల్, డ్యాన్స్, ఎనర్జీతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న హీరో. 2006లో విడుదలైన 'దేవదాసు' సినిమాతో హీరోగా పరిచయమైన రామ్ తొలి చిత్రంతోనే భారీ విజయాన్ని అందుకోవడంతో పాటు ఫిలింఫేర్ సౌత్ ఉత్తమ నూతన నటుడు అవార్డును సొంతం చేసుకున్నారు. కెరీర్ ప్రారంభంలో వరుస విజయాలతో దూసుకెళ్లిన ఆయనకు యువతలో ప్రత్యేక ఫ్యాన్ బేస్ ఏర్పడింది. అయితే గత కొన్నేళ్లుగా రామ్ సినిమాలు విమర్శకుల ప్రశంసలు అందుకున్నప్పటికీ బాక్సాఫీస్ వద్ద ఆశించిన స్థాయిలో వసూళ్లు రాకపోవడంతో సరైన బ్లాక్‌బస్టర్ కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఇటీవల విడుదలైన 'ఆంధ్ర కింగ్ తాలూకా' సినిమాకు మంచి రివ్యూలు వచ్చినప్పటికీ కమర్షియల్‌గా పెద్ద విజయాన్ని నమోదు చేయలేకపోయింది. ఈ చిత్రానికి మహేష్ బాబు.పి దర్శకత్వం వహించగా కన్నడ స్టార్ ఉపేంద్ర కీలక పాత్రలో కనిపించారు. ఈ ఫలితం రామ్‌ను మరింత జాగ్రత్తగా ఆలోచించేలా చేసినట్లు ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి. అందుకే ఈసారి కెరీర్‌లో స్పీడ్ పెంచి వరుస ప్రాజెక్టులతో ప్రేక్షకుల ముందుకు రావాలని ఆయన నిర్ణయించుకున్నారని సమాచారం. ప్రస్తుతం రామ్ ఆర్కా మీడియా వర్క్స్ బ్యానర్‌లో ఓ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌కు సైన్ చేశారు. ఈ సినిమా ప్రీప్రొడక్షన్ దశలో ఉండగానే మరో కొత్త కథకు కూడా ఆయన గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు టాక్ వినిపిస్తోంది. ఈ ప్రాజెక్ట్‌ను ఓ కొత్త దర్శకుడు తెరకెక్కించనున్నారని తెలుస్తోంది. రామ్ బాడీ లాంగ్వేజ్‌కు తగ్గట్టుగా పక్కా మాస్ యాక్షన్ ఎలిమెంట్స్‌తో ఈ కథ సిద్ధమైందని, ముఖ్యంగా కథలోని ప్రధాన పాయింట్ ఆయనను బాగా ఆకట్టుకోవడంతో వెంటనే ఓకే చెప్పారని సమాచారం.

# ధనుష్ 55లో శ్రీలీల



సాధారణంగా సినీరంగంలో విజయాలు లేకపోతే అవకాశాలు వాటంతటవే తగ్గిపోతాయి. కానీ అచ్చతెలుగందం శ్రీలీల విషయంలో ఈ ట్రెండ్ రివర్స్ అవుతున్నది. ఇటీవలకాలంలో ఈ భామ నటించిన సినిమాలు ఆశించిన విజయాల్ని అందుకోలేకపోయాయి. అయినా ఈ అమ్మడికి అవకాశాలు మాత్రం భారీగానే వస్తున్నాయి. చూడముచ్చటైన అందం, చక్కటి స్క్రీన్‌ప్రజెన్స్, యువతలో తిరుగులేని ఫాలోయింగ్ వంటి కారణాలు సినిమా ఫలితాలతో సంబంధం లేకుండా అవకాశాల్ని తెచ్చిపెడుతున్నాయని ఇండస్ట్రీ టాక్. తాజాగా ఈ ముద్దుగుమ్మ తమిళంలో ధనుష్ సరసన బంపరాఫర్‌ను దక్కించుకుంది. ధనుష్ హీరోగా 'అమరన్' ఫేమ్ రాజ్‌కుమార్ పెరియసామి దర్శకత్వంలో ఓ చిత్రం తెరకెక్కుతున్న విషయం తెలిసిందే. ఇందులో శ్రీలీలను కథానాయికగా ఖరారు చేశారు. ఈ విషయాన్ని చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. ఇటీవల విడుదలైన 'పరాశక్తి' చిత్రంతో తమిళంలో ఎంట్రీ ఇచ్చింది శ్రీలీల. అయితే ఈ సినిమా పరాజయం పాలైంది. ఈ నేపథ్యంలో కోలీవుడ్‌లో మరో ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌లో శ్రీలీల ఆఫర్‌ను దక్కించుకోవడం విశేషం.

# మెగా ఫ్యామిలీలో డబుల్ జాయ్

టాలీవుడ్ మెగా కుటుంబంలో ఆనందోత్సాహాలు వెల్లివిరిశాయి. మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ ఉపాసన కొణిదెల దంపతులు కవలలకు తల్లిదండ్రులయ్యారు. శనివారం రాత్రి హైదరాబాద్‌లోని అపోలో ఆసుపత్రిలో ఉపాసన ఒక మగ శిశువుకు, ఒక ఆడ శిశువుకు జన్మనిచ్చారు. ఈ శుభవార్తతో కొణిదెల కుటుంబం, కామినేని కుటుంబం ఆనందంలో మునిగిపోయాయి. మెగా అభిమానులు "డబుల్ జాయ్" అంటూ సంబరాలు జరుపుకుంటున్నారు. కవలల జననం అనంతరం రామ్ చరణ్ సోషల్ మీడియాలో చేసిన భావోద్వేగ ట్వీట్ ఇప్పుడు నెట్టింట వైరల్‌గా మారింది. మాకు ఒక పాప, ఒక బాబు పుట్టారని ఆనందంగా పంచుకుంటున్నాను. ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉండటం మా జీవితాన్ని అపారమైన కృతజ్ఞతతో నింపింది. మా జీవితంలో ఉన్న మహిళలే మా గొప్ప బలం. ప్రతి క్షణంలో మాకు అండగా నిలిచిన అభిమానులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు హృదయపూర్వక ధన్యవాదాలు" అంటూ ఆయన రాసిన మాటలు అభిమానుల హృదయాలను తాకాయి. ముఖ్యంగా తన జీవితంలో మహిళల పాత్రను ప్రత్యేకంగా ప్రస్తావించడం సోషల్ మీడియాలో చర్చనీయాంశమైంది. ఈ గుడ్ న్యూస్ తెలిసిన వెంటనే మెగా అభిమానులు పెద్ద ఎత్తున అపోలో ఆసుపత్రి వద్దకు చేరుకుని బాణాసంచా కాల్చుతూ పండగ వాతావరణాన్ని సృష్టించారు. సోషల్ మీడియా వేదికగా కూడా వేల సంఖ్యలో శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. సినీ ప్రముఖులు, రాజకీయ నాయకులు, అభిమానులు వరుసగా విషెస్ తెలియజేస్తున్నారు. రామ్ చరణ్ ఉపాసన దంపతులకు కవలలు పుట్టడంపై మెగాస్టార్ చిరంజీవి కూడా తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు. మీడియాతో మాట్లాడుతూ,ఎప్పటి నుంచో మా ఇంట్లో ఇలాంటి శుభం జరగాలని కోరుకున్నాం. భగవంతుడి దయతో, హనుమాన్ కృప వల్ల ఒక ఆడబిడ్డ, ఒక మగబిడ్డ జన్మించారు. ఇది మాకు ఎనలేని ఆనందాన్ని ఇచ్చింది" అంటూ తన సంతోషాన్ని పంచుకున్నారు. ఉపాసన ప్రసవాన్ని విజయవంతంగా నిర్వహించిన అపోలో ఆసుపత్రి వైద్య బృందానికి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అపోలో ఆసుపత్రి వైద్యులు మీడియాతో మాట్లాడుతూ ఉపాసన, ఇద్దరు చిన్నారులు సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్నారని స్పష్టం చేశారు. మొదట బాబు, ఆ తర్వాత పాప జన్మించినట్లు వెల్లడించారు.

